అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మైసమ్మగుట్ట కాలనీ, కొండాపూర్ సర్వే నంబర్ 257లోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొంతమంది స్థానికులు గురువారం తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్కారు భూమిలో అక్రమంగా నిర్మిస్తున్నవారి నుంచి డబ్బులు వసూలు చేసి.. ఆపై ఇంటి నంబర్లు ఇప్పిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారణ జరపాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టి.రాజు, జగదీశ్, ఆర్.రాజు తదితరులున్నారు.

నిబంధనలు పాటించని వాటర్‌ప్లాంట్ సీజ్

ఘట్‌కేసర్: నాణ్యత లేని వాటర్ ప్యాకెట్లు తయారు చేస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని బాలాజీనగర్ రైల్వేగేటు వద్ద జహంగీర్ పాషా(52) కొన్నాళ్లుగా ఆహార భద్రత నియమాలు పాటించకుండా వాటర్ ప్యాకెట్లు తయారు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం నీటి తయారీ కేంద్రంపై దాడి చేసి 20 సంచుల ప్యాకెట్లు, తయారీ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

బాధ్యతగా పనిచేయాలి

ఎన్నికల సమావేశంలో అధికారులకు కలెక్టర్ గౌతమ్ సూచన



సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పని చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో, వీవింగ్ సర్వెలెన్స్, ఎంసీసీ బృందాలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతిఒక్కరికి సమానంగా వర్తిస్తుందన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు 24/7 పర్యవేక్షణలో ఉంటాయన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు ఇవ్వడం లాంటివి పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశించారు. ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చుల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఏమైనా అనుమానాలు, తెలియని విషయాలుంటే సంబంధిత ఉన్నత అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. జిల్లాలో సమస్యాత్మక ప్రదేశాలకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు సకాలంలో చేరుకోలేని పక్షంలో కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో స్టాటిస్టిక్ సర్వెలెన్సులు చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. ఎక్కడైనా రూ.50 వేల కంటే అధికంగా సరైనా ఆధారాలు లేకుండా నగదు రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే సీజ్ చేసి ట్రెజరీలో డిపాజిట్ చేయాలన్నారు. సీజ్ చేసిన నగదు వివరాలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి చూపించి తమ నగదును విడుదల చేసుకోవచ్చని ప్రజలకు తెలిపారు. రూ.10 లక్షల వరకు ఆధారాలు లేకపోతే ఇన్‌కమ్‌టాక్స్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలుంటే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేలా ఎన్నికల కమిషన్ యాప్ రూపొందించిందని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించే సమయంలో ఆధారాలు సేకరించాలన్నారు. జిల్లాలో ఎన్నికల సమయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనిచేయాలని కోరారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ 24/7 నిర్వహించాలని, ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, కోడ్ అమలులోకి రాగానే విధులపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అన్నారు. అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళి, విధులు, ఏర్పాట్లు తదితర విషయాలపై జిల్లా ట్రైనర్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీఓ రాజేందర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కేశురామ్, డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ తిరుమలేష్, ఈ-డిస్టిక్ మేనేజర్ భాను ప్రకాష్, టీం అధికారులు, వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల ఉత్తర్వులు అందజేత



శ్రీకాంత్‌యాదవ్‌కు మంజూరుపత్రాలను అందచేస్తున్న వజ్రేష్ యాదవ్

జవహర్‌నగర్: కార్పొరేషన్ అభివృద్ధికి మంజూరైన రూ.39 లక్షలకు సంబంధించిన ఉత్తర్వుపత్రాలను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ నుంచి గురువారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అందుకున్నారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, నగేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న కీసర ఎంపీపీ..?



ఇందిర లక్ష్మీనారాయణ

కీసర: బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. మొన్న నాగారం మున్సిపల్ చైర్మన్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలోకి వెళ్తున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. తాజాగా కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ కూడా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యవహారశైలితో ఇబ్బందులకు గురికావడంతో పాటు పలుమార్లు అవమానాల పాలవడంతో ఇందిర బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్నా కీసర మండల అభివృద్ధికి నిధులు కేటాయించ లేదని గతంలోనే పలుమార్లు ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసుత్తం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రావడంతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

‘చేరిక’లపై మా అభిప్రాయమూ తీసుకోవాలి



మండల కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మేడ్చల్: మండలంలోని గ్రామస్థాయి, మండల కాంగ్రెస్ కమిటీలను సంప్రదించకుండా ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని మండల కాంగ్రెస్ తీర్మానించింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన మేడ్చల్‌లో గురువారం నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశంలో నాయకులు తీర్మానించారు. ఇతర పార్టీల్లో ఎంత పెద్ద నాయకుడైనా స్థానిక నాయకుల అభిప్రాయం తీసుకోకుండా చేర్చుకోవద్దని సూచించారు. అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వరదారెడ్డి, జీనత్‌రెడ్డి, సంజీవరావు, రవి, కృష్ణ, రాజు, పలు గ్రామాల కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

కాలనీల్లో కమిషనర్ తనిఖీలు



సంపును పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

మేడ్చల్: వేసవిలో మంచినీటి సమస్య కొతర ఏర్పడుతుండటంతో పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి గురువారం ఆకస్మికంగా పర్యటించారు. నల్లాలకు అక్రమంగా బిగించిన ఎనిమిది మోటార్లను సీజ్ చేశారు. వెంకటరామయ్య కాలనీ, గొల్లగడ్డ, రాఘవేంద్రకాలనీ, ఎల్బీనగర్, వీకర్ సెక్షన్ కాలనీ, టీచర్స్ కాలనీలో పర్యటించారు. నీటిచౌర్యంకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

మేడ్చల్ మున్సిపాలిటీకి రూ.68 లక్షలు మంజూరు



శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.68 లక్షలు మంజూరు చేసిందని పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు.. స్థానిక కాంగ్రెస్ నాయకుల విన్నపం మేరకు నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. పట్టణ పరిధిలోని గిర్మాపూర్‌లో సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు, కిష్టాపూర్ అర్చన కాలనీలో సీసీ కోసం రూ.18 లక్షలు, రెండో వార్డుకు రూ.10 లక్షలు, కింది బస్తీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, మారుతి అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, 8వ వార్డులో డ్రైనేజీ కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. నిధుల మంజూరు చేయించిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రామలింగేశ్వర స్వామి జాతర ప్రారంభం




అంకురార్పణ పూజలు



విద్యుత్ కాంతుల్లో మేడ్చల్ దాక్షాయని రామలింగేశ్వరస్వామి ఆలయం

మేడ్చల్: దాక్షాయని సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ధాత్రిక కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గణపతి పూజ, హోమం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ,, రాత్రి నందీశ్వర సేవ తదితర కార్యక్రమాలతో జాతర ప్రారంభించారు. నేడు(15వ తేదీన) భృంగీశ్వర సేవ, 16న హంస వాహన సేవ, 17న అశ్వవాహన సేవ, 18న స్వామి కల్యాణం, అగ్ని గుండాలు, గజవాహన సేవ, 19న రథోత్సవం, 20న దోపు సేవ(జాతర) కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, తోరణాలతో అలంకరించారు. మేడ్చల్ జాతరకు అధికారులు, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

బాలుడి అదృశ్యం



అమిత్‌కుమార్(ఫైల్)

మేడ్చల్‌రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. ఎస్సై మురళీధర్ తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నరేందర్ కుటుంబం పది రోజుల క్రితం నగరానికి వలస వచ్చి మేడ్చల్‌లోని కిందిబస్తీలో నివాసం ఉంటోంది. ఆయన కుమారుడు అమిత్‌కుమార్(14) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో నరేందర్ కుటుంబం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించింది.

రేపు ఫ్రీ హియరింగ్ స్క్రీనింగ్ క్యాంప్

నిజాంపేట్: ప్రైమ్ రిహాబ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని కమ్యూనిటీ హాలులో ఈనెల 16న పిల్లలు, పెద్దలకు ఫ్రీ హియరింగ్ స్క్రీనింగ్ క్యాంప్, చైల్డ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగే శిబిరంలో వినికిడి తగ్గిన వారు, మందకోడిగా ఉండే పిల్లలకు పరీక్షలు నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు సూచనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం.9121295999లో సంప్రదించాలని కోరారు.

థీమ్‌పార్క్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్

మల్లాపూర్: త్వరితగతిన థీమ్‌పార్క్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. మల్లాపూర్‌లో దాదాపు రూ.4 కోట్లతో చేపట్టిన థీమ్‌పార్కు పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక హంగులతో మల్లాపూర్‌లో థీమ్ పార్క్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదేవిధంగా పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు శేఖర్, లోకేశ్, శ్రవణి, డీఈ రూప, ఏఈ సవంత్రి, జలమండలి డీజీఎం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి కమ్యూనిటీ హాల్

ప్రారంభించిన చైర్మన్ కొండల్‌రెడ్డి



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యానంపేట్‌లో కమ్యూనిటీ భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చామని చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. 3వ వార్డు పరిధిలో నిర్మించిన ఈ భవనాన్ని చైర్మన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.35 లక్షల సాధారణ నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మించామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంతో పాటు ప్రత్యామ్నాయాలపై దుకాణాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ పశ్య వేమనరెడ్డి, స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నల్లవెల్లి శేఖర్, నర్రి కాశయ్య, బద్దం జగన్మోహన్‌రెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి, సగ్గు రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం



కుమార్‌ముదిరాజ్

ఘట్‌కేసర్: ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధులు నుంచి రూ.50 లక్షలు కేటాయించినందుకు గ్రామ మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎదులాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. అదనపు తరగతి తరగతులు నిర్మాణానికి నిధుల కోసం కృషి చేసిన జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలని వినతి



దాన కిషోర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం డాక్టర్ అంబేడ్కర్ సచివాలయంలో అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ పనులతో పాటు గౌతంనగర్‌లో తాగునీరు రిజర్వాయర్లను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. ఇందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్, మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, రాము యాదవ్, రమేశ్, పరమేశ్, ఇబ్రహీం, రాజు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



పరమేశ్వర్‌రెడ్డిని కలిసిన హెచ్‌బీకాలనీ నాయకులు

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ అభివృద్ధికి రూ.60 లక్షల నిధులు మంజూరు కావడంపై కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేసిన కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. రూ.60 లక్షలతో కైలాసగిరి, ఇందిరానగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, నవోదయనగర్, డైమండ్స్‌హిల్స్ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలతో పాటుగా మౌలిక వసతుల కల్పన కోసం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని పరమేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలగం వెంకటేశ్, గుర్రాల సంతోష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులున్నారు.

అడ్డూఅదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు

- అనుమతి లేకుండా చాయ్ దుకాణం ఏర్పాటు
- మాజీ ఎంపీటీసీకి చెందిన షాప్ కావడంతో పట్టించుకోని అధికారులు



కొంపల్లిలో ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌ను ఆనుకుని రోడ్డుపై ఏర్పాటు చేసిన చాయ్ దుకాణం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్ ముందు భాగంలో చాయ్ దుకాణం పేరిట భారీ నిర్మాణం చేపట్టారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

◆ ఈ నిర్మాణానికి అనుమతి లేకపోయినా ఫంక్షన్‌హాల్ పేరుతో ఉన్న ఈ ఖాళీ స్థలంలో ఇటీవల చాయ్ దుకాణం పేరిట షెడ్డు ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డుకు ఆనుకొని సుమారు 400 గజాల విస్తీర్ణంలో చుట్టూ టేబుల్ వేసి పార్కింగ్‌ను రోడ్డు మీదనే ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణానికి అనుమతి లేకపోవడంతో ఇప్పటికే పలువురు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేయగా నోటీసులు సిద్ధం చేశారు.

◆ ఇదే విషయంపై కమిషనర్ స్పందిస్తూ నోటీసు జారీ చేసి కూల్చివేతలు చేపడతామని తెలిపారు. సదరు అక్రమ నిర్మాణం మాజీ ఎంపీటీసీకి చెందినది కావడంతో నిర్మాణ సమయంలో అధికారులు చోద్యం చూశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

150 గంజాయి చాక్లెట్ల పట్టివేత

జీడిమెట్ల: ఓ కిరాణా దుఖాణంలో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన శిబుకుమార్(19) ఉపాధి కోసం నగరానికి వచ్చి రాంరెడ్డినగర్‌లో నివాసం ఉంటూ ఓ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నట్లుఓ వ్యక్తి ఇచ్చిన సమాచాం మేరకు బుధవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేశారు. దీంతో అతని దుకాణంలో 150 గంజాయి చాక్లెట్లు లభ్యం అయ్యాయి. మొత్తం 600 గ్రాముల చాక్లెట్లతో పాటు స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.11500 మేరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు.

ఈటల కోడలు ఇంటింటా ప్రచారం



గిర్మాపూర్ ప్రచారం చేస్తున్న క్షమిత తదితరులు

మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరుతూ ఆయన కోడలు క్షమిత పట్టణ బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్ వార్డులలో నాయకులతో కలిసి ఆమె పర్యటిస్తూ కరపత్రాలు అందజేశారు. డప్పు చప్పులతో ఊరేగింపు నిర్వహిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, రాఘవరెడ్డి, ప్రేమ్‌దాస్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

తూంకుంటలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలో ప్రభుత్వానికి చెందిన దేవాదాయ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నాయకుడు లక్ష్మీనారాయణ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 63లోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా గోదాం నిర్మాణం చేపడుతున్నారని.. దీని వల్ల మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మత పెద్దలతో శాంతి సమావేశం



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

కీసర: పండుగలను ప్రశాతంగా జరుపుకోవాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. గురువారం కీసర పోలీస్‌స్టేషన్ ఆవరణలో రంజాన్, హోలీ పండుగ నేపథ్యంలో ఇరువర్గాల మత పెద్దలతో నిర్వహించిన శాంతి సమావేశం(పీస్‌మీటింగ్)లో ఆయన మాట్లాడారు. హిందు, ముస్లింలు తమ పండుగలను ప్రశాతమైన వాతవరణలో నిర్వహించుకోవాలన్నారు. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సైలు మధు, రాజశేఖర్, వెంకటేశ్, జాన్సన్, పలు గ్రామాల ప్రజలు, మత పెద్దలు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో సుమారు రూ.15 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు కళావతి, చింతల సరిత రమేశ్, నాగేశ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు అశోక్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: మహాలక్ష్మి ఆలయ నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనము, లక్ష్మీగణపతి హవనము తదితరు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యప్రకాష్‌రెడ్డి, సుధాకర్, సుబ్రహ్మణ్యం, అర్జున్‌రావు, మనోజ్, మాథూర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.